

# చిన్నారులకు 'తొలి ముద్ద'

లక్షలాది మందికి బాలామృతం

గర్భిణీలు, పిల్లల పౌష్టికాహారమే లక్ష్యం

నాచారంలో కొత్త ప్లాంట్ ప్రారంభోత్సవంలో సిఎం

2లో



రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్

వార్త




బోసిపోయిన జిల్లా రవాణా కార్యాలయం (ఇన్‌సెట్)డిటివో సుభాష్‌చంద్రరెడ్డి

## దళారీలకు నోఎంట్రీ

### రవాణాశాఖలో సుభాష్ చంద్రుడి మార్క్

◆నేరుగా వస్తేనే సేవలు ◆వికారాబాద్, పరిగి, తాండూరు కార్యాలయాల్లో ప్రక్షాళనకు శ్రీకారం ◆నిరాశలో చోటా లీడర్లు ◆రాజకీయ ఒత్తిళ్లు తెచ్చే ప్రయత్నాలు.. ◆నిబంధనల ఉల్లంఘన వాహనాలపైనా ఉక్కుపాదం మోపాలని ప్రజల డిమాండ్

**ప్రభాతవార్త, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :** వికారాబాద్ జిల్లా రవాణాశాఖలో చాలా కాలంగా సాగుతున్న బ్రోకర్ల వ్యవస్థకు ఎట్టకేలకు చెక్ పడింది. నెల రోజుల క్రితమే జిల్లా రవాణాశాఖ అధికారిగా బాధ్యతలు చేపట్టిన సుభాష్ చంద్రరెడ్డి కార్యాలయంలో ప్రక్షాళనకు శ్రీకారం చుట్టారు. ఆఫీసులో ఈగల్లా వాలిపోతూ, అధికారుల పనుల్లో మితిమీరిన జోక్యం చేసుకుంటున్న బ్రోకర్లను ప్రస్తుతం ఆయన కార్యాలయంలోకి అనుమతించడం లేదు. వాహనదారులు ఎవరూ దళారులను ఆశ్రయించకుండా, నేరుగా ఆఫీసుకు వచ్చి సేవలు పొందాలని ఆయన సూచిస్తున్నారు. డీటీవో తీసుకున్న ఈ నిర్ణయంతో చాలామంది బ్రోకర్లు తీవ్ర నిరాశకు గురవుతున్నారు. కార్యాలయంలో తమ పప్పులు ఉడకకపోవడంతో, తమకు తెలిసిన స్థానిక రాజకీయ నాయకులతో డీటీవోపై ఒత్తిడి తీసుకువచ్చే ప్రయత్నాలు కూడా చేస్తున్నట్లు తెలుస్తోంది. వికారాబాద్ మెయిన్ ట్రాన్స్ పోర్ట్ ఆఫీసుతో పాటు పరిగి, తాండూరు యూనిట్ ఆఫీసుల్లో కూడా ఈ బ్రోకర్ల వ్యవస్థ బాగా వేళ్లూనుకుంది. తెలంగాణలో కొత్త జిల్లాల ఆవిర్భావం తర్వాత రవాణా సేవలు మరింత అందుబాటులోకి వచ్చినప్పటికీ, వినియోగదారులు మాత్రం ఇంకా బ్రోకర్లపైనే ఆధారపడుతూ వచ్చారు. మొన్నటి వరకు నేరుగా వచ్చే సామాన్య వినియోగదారులకు కార్యాలయాల్లో >>2



# పైసా వసూల్

## ప్రాణాలపై త్రిశూల్

★రోగులపై ఫార్మా మాఫియా పంజా ★పైసల్లోనే మందుల తయారీ ఖర్చు ★మార్కెట్లో రేట్లు మాత్రం వేలల్లో.. ★50 నుండి 70 శాతం మార్జిన్లు ★ప్రైవేట్ వైద్యులకు ఆఫర్ల ఎర ★ఒక బాక్సు కొంటే 9 ఫ్రీ.. ★ఆ మందులు సొంత మెడికల్ షాపుల్లోనే దొరికేలా ఏర్పాట్లు ★కమీషన్ల కోసం లేబొరేటరీలతోనూ చీకటి ఒప్పందాలు ★మొక్కుబడిగా డ్రగ్ కంట్రోల్ తనిఖీలు

*కంటికి కనిపించని ఆ వైరస్ కంటే... కంటిముందే తిరుగుతున్న మందుల మాఫియా మరింత ప్రమాదకరంగా మారింది. రూపాయి ఖర్చుతో నయమయ్యే రోగానికి, వేల రూపాయల బిల్లులు వేస్తూ సామాన్యుడి రక్తాన్ని పిండేస్తోంది. ఒకవైపు విపరీతమైన ధరల భారం, మరోవైపు నాణ్యత లేని నకిలీ మందులు, ఇంకోవైపు అవసరం లేని టెస్టుల దందా... ఈ మూడు కోరలతో మందుల మాఫియా సామాన్యుడి ప్రాణాలను నిలువునా బలితీసుకునే ఒక ....అదృశ్య త్రిశూలంలా మారింది. రోగాన్ని నయం చేయాల్సిన మందులే, రోగి ప్రాణాలను హరించే ఆయుధాలుగా మారుతున్న వేళ... సామాన్యుడి బతుకు పైసా వసూల్ వ్యాపారంలో నలిగిపోతోంది!*

**ప్రభాతవార్త, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :** మార్కెట్లో కూరగాయల ధరలపై బేరమాడే వినియోగదారులు ఔషధాల అంగళ్లలో పెరుగుతున్న ధరలపై మాత్రం కిమ్మనకుండా కొనుగోలు చేస్తున్నారు. ప్రతి రెండు, మూడు నెలలకు ఒకసారి తరచూ పెరుగుతున్న మందు బిల్లల ధరలు రోగులకు శాపంగా మారుతున్నాయి. ఒకవైపు రోగాలబారిన పడి, మరోవైపు పెరుగుతున్న ఔషధాల ధరల భారం మోయలేమని రోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాదిన్నర కాలంలో పెరుగుతున్న ధరలపై ప్రశ్నించలేని పరిస్థితి నెలకొన్నదని, ఫార్మా కంపెనీలపై నియంత్రణ లేకపోవడం వల్లే పరిస్థితి ఇలా దాపురించిందని విమర్శలు వస్తున్నాయి. ముఖ్యంగా దీర్ఘకాలిక రోగాల బాధితులు నెలనెలా ఔషధాలు కొనుగోలు చేస్తుండటంతో, వీటి ధరల పెరుగుదలపై తీవ్రంగా ఆందోళన చెందుతున్నారు. ఈ ధరల పెంపునకు పలువురు డాక్టర్ల చేతివాటమే కారణమని ఆరోపణలు వస్తున్నాయి. ఔషధాల విక్రయాలలో పెద్ద మాయాజాలం కనిపిస్తోంది. ఫార్మా కంపెనీలు తక్కువ ఖర్చుతోనే మందులు తయారీ చేస్తున్నప్పటికీ, పలువురు ప్రైవేట్ డాక్టర్లకు భారీ ఆఫర్లు ఇస్తున్నట్లు సమాచారం. ఒక బాక్స్ ఔషధాలు కొనుగోలు చేస్తే ఆరు నుండి తొమ్మిది బాక్సులను సదరు డాక్టర్లకు ఉచితంగా ఇస్తున్నట్లు తెలుస్తోంది. చాలామంది డాక్టర్లు సొంత నర్సింగ్ హోమ్‌లు, క్లినిక్‌లు నడుపుతూనే, వాటికి అనుబంధంగా తమ బంధువులు లేదా స్నేహితుల భాగస్వామ్యంతో సొంత మెడికల్ షాపులను నిర్వహిస్తున్నారు. కంపెనీలు ఆయా ఔషధాలపై 50 నుండి 70 శాతం వరకు లాభాలు ప్రకటిస్తూ, వైద్యులకే అధిక వాటాలు ఇస్తూ సామాన్యులను దోచుకునే పనిలో పడ్డాయి. వైద్యులు రాసే మందులు బయట సాధారణ మెడికల్ షాపుల్లో పెద్దగా దొరకవు. ప్రిస్క్రిప్షన్ రాసిన వైద్యుల మెడికల్ షాపుల్లోనే అవి లభిస్తాయి. పట్టపగలే బహిరంగ మార్కెట్లో జరుగుతున్న ఈ దోపిడీపై విద్యావంతులు కూడా ప్రశ్నించడం లేదు. రోగుల బలహీనతలను ఆసరాగా తీసుకున్న కంపెనీలు ఔషధాల ధరలను విపరీతంగా పెంచేస్తున్నాయి. పలు మెడికల్ షాపుల్లో మందులపై 5 నుండి 10 శాతం వరకు డిస్కౌంట్ ఇస్తున్నప్పటికీ, అది కూడా కేవలం రెగ్యులర్ పేషంట్లకు మాత్రమే వర్తింపజేస్తున్నారు. ఫార్మా కంపెనీల నుండి మాత్రం వీరు భారీగా పర్సెంటేజీలు తీసుకుంటున్నారని తెలుస్తోంది. ఫార్మా కంపెనీల్లో తయారు చేసే మందులను మరోచోట ప్యాకింగ్ చేసి, స్టాంపింగ్ కోసం వేరే చోటుకు తరలిస్తారు. ఈ స్టాంపింగ్ చేసేటప్పుడే ధరల ముద్రణ చేపడుతున్నట్లు సమాచారం. అయితే, ఈ మందుల నాణ్యతను పరిశీలించే నాథుడే కరువయ్యాడు. గతంలో మెడికల్ షాపులపై అధికారులు దాడులు నిర్వహించేవారని, కానీ ఇప్పుడు ఆ పరిస్థితి ఎక్కడా కనిపించడం లేదని రోగులు వాపోతున్నారు. ప్రస్తుతం దర్జాగా సాగుతున్న ఈ మందుల దందా నుండి తమను కాపాడాలని బాధితులు కోరుతున్నారు. ఇక కమీషన్ల కోసం లాబొరేటరీలతోనూ కొంతమంది డాక్టర్లు చీకటి ఒప్పందాలు కుదుర్చుకుని అవవసరం లేని టెస్టులు రాస్తున్నారని తెలుస్తోంది.

## కష్టపడి పనిచేసేవారికి పదవులు ఖాయం

పిఏసిఎస్ పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవంలో పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి 2లో

## షాద్‌నగర్‌లో డంపింగ్ యార్డ్ సెగలు

తరలివచ్చిన సిద్ధాపూర్ ప్రాంత ప్రజలు - ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి డిమాండ్ 2లో



ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురైన ధారూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మాన్ సింగ్‌ను పరామర్శిస్తున్న శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్

## ప్రతి విషయాన్నీ రాజకీయం చేయొద్దు

### ప్రతిపక్షాలకు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ హితవు

**ధారూర్, జులై 7, ప్రభాతవార్త:** గత ప్రభుత్వం చేసిన అప్పుల భారాన్ని ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం సమర్థవంతంగా మోస్తూనే, రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో ముందుకు వెళ్తోందని శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ స్పష్టం చేశారు. మంగళవారం ధారూర్ మండల పరిధిలోని తరిగోపుల గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో చేపట్టనున్న గోదాము నిర్మాణానికి >>2

# మీ నమ్మకమే నన్ను మంత్రిని చేసింది

■నిలబెట్టుకోవడం నా బాధ్యత ■ఇబ్రహీంపట్నంలో కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఉద్ఘాటన ■రూ.338 కోట్ల వ్యయంతో ఆధునిక నాలుగు లైన్‌ల రహదారుల నిర్మాణ పనులకు శంకుస్థాపన

**రంగారెడ్డిఅర్బన్, జులై7, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం రహదారుల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, మెరుగైన మౌలిక సదుపాయాలే ప్రాంతీయ అభివృద్ధికి బాటలు వేస్తాయని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. ఇబ్రహీం పట్నం నియోజకవర్గం తొర్రూర్ గ్రామంలో రూ.338 కోట్ల వ్యయంతో ఇబ్రహీంపట్నం, మేడ్చల్, మహేశ్వరం నియోజకవర్గాల్లో హైబ్రిడ్ అన్యుటీ మోడల్ విధానంలో చేపట్టనున్న ఆధునిక నాలుగు లైన్‌ల రహదారుల నిర్మాణ పనులకు మంత్రి మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఈటల రాజేందర్, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, తెలంగాణ రాష్ట్ర రోడ్డు అభివృద్ధి సంస్థ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, టీయూఎఫ్ఐడీసీ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి, ఎమ్మెల్సీ శంకర్ నాయక్, జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి, గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన సభలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ ఇబ్రహీంపట్నం ప్రజలు, కార్యకర్తలు, నాయకులు తనపై ఉంచిన విశ్వాసం వల్లే రాష్ట్రంలో కీలకమైన రోడ్లు, భవనాల శాఖ మంత్రిగా సేవ చేసే అవకాశం లభించిందన్నారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవడం తన బాధ్యత అని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే రూ.85 కోట్ల విలువైన రహదారి పనులను పూర్తి చేసిందని, మరో రూ.275 కోట్లతో పలు అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని మంత్రి తెలిపారు. అదనంగా రూ.100 కోట్ల విలువైన కొత్త రహదారి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించినట్లు వెల్లడించారు. ట్రాఫిక్ సమస్యల పరిష్కారం, జాతీయ రహదారుల విస్తరణ వంటి అంశాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని, ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేస్తూ తెలంగాణను మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తామని స్పష్టం చేశారు. పార్టీలు వేర్వేరు అయినప్పటికీ అభివృద్ధి విషయంలో అందరూ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో రూ.338 కోట్లతో 140కు పైగా రహదారి పనులు చేపట్టినట్లు తెలిపారు. గ్రామాలు, బస్తీల్లో రోడ్లు, డ్రైనేజీల నిర్మాణంతో పాటు విద్య, వైద్యం, మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. ప్రభుత్వ పాఠశాలలను ఆధునిక తెలంగాణ పబ్లిక్ స్కూల్స్‌గా తీర్చిదిద్దుతున్నామని లక్ష్మీరెడ్డిపాలెం వద్ద ఫ్లైఓవర్, అండర్‌పాస్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించినట్లు తెలిపారు. ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గానికి రూ.338 కోట్ల విలువైన రహదారి పనులు మంజూరు కావడం చారిత్రాత్మకమని పేర్కొన్నారు. ఇందులో సుమారు రూ.275 కోట్ల పనులు ఇబ్రహీంపట్నం పరిధిలోనే చేపడుతున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో 200 పడకల ఆసుపత్రి, ప్రభుత్వ పాఠశాలల >>2



ఇబ్రహీంపట్నం నియోజకవర్గ పర్యటనకు వచ్చిన కోమటిరెడ్డిని సత్కరిస్తూ ఆనందోత్సాహాన్ని వ్యక్తంచేస్తున్న కార్యకర్తలు



## ఇక మిగిలింది ఐదు రోజులే

ప్రతి పోలింగ్ కేంద్రంలో రెండు హెల్ప్‌డెస్క్‌లు

సర్ ప్రక్రియలో ప్రజలకు అవసరమైన సహాయాన్ని అందించండి

ఓటర్ల వివరాలన్నీ డిజిటలైజేషన్ చేయాలి

అధికారులకు కలెక్టర్ ఆదేశం

**రంగారెడ్డిఅర్బన్, జులై7, ప్రభాతవార్త:** ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియను వేగవంతం చేసి, రాబోయే ఐదు రోజుల్లో 100 శాతం పనులు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ అమలుపై మంగళవారం జిల్లా అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన పురోగతిని సమీక్షించారు. జిల్లాలో ఇప్పటివరకు 92 శాతం ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ పూర్తయిందని, మిగిలిన ఫారాల పంపిణీని >>2



బాచారం ఆయిల్‌పామ్ తోటను సందర్శిస్తున్న కలెక్టర్

## ఆయిల్‌పామ్ సాగుతో స్థిరమైన ఆదాయం

### రైతులకు కలెక్టర్ దీపక్ తివారీ సూచన

**ధారూర్, జులై 7, ప్రభాతవార్త:** ఆయిల్‌పామ్ సాగు రైతులకు దీర్ఘకాలికంగా స్థిరమైన ఆదాయాన్ని అందించే లాభదాయకమైన పంట అని జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ అన్నారు. మంగళవారం ధారూర్ మండలం బాచారం గ్రామంలో రైతు నర్సింహా రెడ్డి సాగు చేస్తున్న ఆయిల్‌పామ్ తోటను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా తోటలోని మొక్కల పెరుగుదల, డ్రిప్ ఇరిగేషన్ నిర్వహణపై రైతుతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైతు నర్సింహా రెడ్డి తన ఆరు ఎకరాల భూమిలో ఆయిల్‌పామ్ సాగు చేపడుతుండగా, జాతీయ తినదగిన నూనెల మిషన్-ఆయిల్‌పామ్ పథకం కింద ఉద్యాన శాఖ ద్వారా మొక్కలతో పాటు డ్రిప్ ఇరిగేషన్ సౌకర్యాన్ని కల్పించారు. జిల్లాలో ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణాన్ని మరింత పెంచాల్సిన అవసరం ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. ఇందుకోసం ఉద్యాన శాఖ అధికారులు రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని, ప్రభుత్వ సబ్సిడీ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకునేలా ప్రోత్సహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన మరియు పట్టు పరిశ్రమల అధికారి ఎం.ఏ. సత్తార్, మండల స్థాయి అధికారులు, ఉద్యాన శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## సాస్‌లో ఈగలు..

# ఐస్‌క్రీమ్‌లో దోమలు

కస్టమర్లకు రోగాలు వడ్డన

వంటగది మొత్తం బూజు, సాలెపురుగులు..

నాగోల్ లక్కీ హోటల్‌లో ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీ

**ఎల్.బి.నగర్, జులై 7 ప్రభాతవార్త:** వినియోగదారులకు ఆరోగ్యపరమైన ఆహార పదార్థాలను అందించాల్సిన హోటల్లో పూర్తిగా అపరిశుభ్రహానికి నేలవుగా మారాయి. వంటగది పూర్తిగా అపరిశుభ్రం, జిడ్డుతో కూడిన వంట పాత్రలు. బూజు, సాలిడ్ పురుగులు, ఈగలు, క్రిమి కీటకాలతో హోటల్ గది అపరిశుభ్రంగా ఉన్నట్లు ఫుడ్ సేఫ్టీ అధికారులు గుర్తించారు. మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ అధికారుల ఆదేశాల మేరకు మంగళవారం నాగోల్ లక్కీ రెస్టారెంట్లో ఫుడ్‌సేఫ్టీ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించగా హోటల్ పరిశుభ్రతకు సంబంధించి అనేక విషయాలు బట్టబయలు అయ్యాయి. ఫుడ్ సేఫ్టీ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.... నాగోల్ లక్కీ రెస్టారెంట్‌లో ఫుడ్ లైసెన్స్ కాపీ ఏర్పాటు చేయలేదు, విక్రయించే ఆహార పదార్థాలపై లేబుల్స్ ఏర్పాటు చేయలేదు. వెజ్, నాన్‌వెజ్ ఆహార పదార్థాలను ఫ్రిజ్లో నిల్వ ఉంచడం, ఆహార పదార్థాల ప్యాకేజీలపై తేదీ, ఎక్స్పైరి డేటు, బ్యాచ్ నెంబరు స్టిక్కర్లు ఏర్పాటు చేయలేదు, స్టోర్‌రూమ్‌లు అపరిశుభ్రంగా ఉన్నాయి, వంటలోకి ఉపయోగించే ఆహార పదార్థాలను సరిగా భద్రపరచకుండా నేలపై పెట్టారని, వేడినీళ్లతో శుభ్రం చేయకపోవడం, కూరగాయలు కట్ చేసే చాకులు, కత్తులు అపరిశుభ్రంగా ఉన్నాయని, వంటగదిలోని కిటికీలు సాలెపురుగులతో నిండి ఉన్నాయని, వంటగది ఇతర ప్రాంతాలు పూర్తిగా అపరిశుభ్రంగా ఉన్నాయని, సమోసాలు, బిస్కెట్లు ఇతర వస్తువులను పేపర్లతో కప్పి పెడుతున్నారని, ఫుడ్ సేఫ్టీ ట్రైనింగ్ సర్టిఫికెట్ కూడా లేదని గుర్తించినట్లు ఫుడ్ సేఫ్టీ అధికారులు నిర్ధారించారు. ఐస్ క్రీమ్, సాస్ ఇతర వస్తువులు పూర్తిగా ఈగలు, దోమలతో నిండి ఉన్నాయన్నారు. ఇలా లక్కీ రెస్టారెంట్ వంటగదిలోని పరిస్థితి అపరిశుభ్రంగా దారుణంగా ఉందని ఫుడ్ సేఫ్టీ అధికారులు వెల్లడించారు. హోటల్ నిర్వాహకులకు నోటీసులు జారీ చేశామని తెలిపారు.



## పౌల్ట్రీ ధరలు టాప్ గేర్

మేత ఖర్చులు పెరగడంతో తగ్గిన కోళ్ల ఉత్పత్తి..

పెళ్లిళ్ల సీజన్ ఆర్డర్లతో మార్కెట్లో చికెన్, కోడిగుడ్ల రేట్ల జంప్

**హైదరాబాద్, జులై 7 ప్రభాతవార్త**

సామాన్యుడికి అత్యంత అందుబాటులో ఉండే ఏకైక నాన్‌వెజ్ చికెన్, కోడిగుడ్లు. ప్రస్తుతం వీటి ధరలకు విపరీతంగా రెక్కలొచ్చాయి. కేవలం వారాల వ్యవధిలోనే ధరలు అమాంతం పెరిగిపోవడంతో మధ్యతరగతి, సామాన్య కుటుంబాల బడ్జెట్ తలకిందులవుతోంది. ముక్క లేనిదే ముద్ద దిగని నాన్ వెజ్ ప్రియులకు ఈ ధరల పెరుగుదల షాకిస్తోంది. గడిచిన వారం రోజులుగా మార్కెట్లో చికెన్ ధరలు గరిష్ఠ స్థాయికి చేరుకున్నాయి. గతవారంలో కిలో స్కిన్ లెస్ చికెన్ ధర రూ.290లు-రూ.300లు మధ్య ఉండగా.. ప్రస్తుతం హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో ఏరియాను బట్టి రూ.310 నుంచి రూ.330 వరకూ అమ్ముతున్నారు.

కొన్ని రిటైల్ అవుట్ లెట్లలో ఈ ధరలు మరింత ఎక్కు వగా ఉన్నట్లు తెలుస్తోంది. చికెన్ మాత్రమే కాకుండా.. కోడిగుడ్ల రేట్లు కూడా పెరగడం సామాన్యుడికి గుబులు పుట్టిస్తోంది. నెల క్రితం మార్కెట్లో రూ.6 నుంచి రూ.6.50 పైసల మధ్య పలికిన ఒక గుడ్డు ధర..ఇప్పుడు రూ.7 నుంచి రూ.8లకు జంప్ అయింది. ఈ ధరల పెరుగుదలకు వ్యాపారులు, పౌల్ట్రీరంగ నిపుణులు మూడు కారణాలు చెప్తున్నారు. ఉత్పత్తి, సప్లై గణనీయంగా తగ్గిందని, పైగా కోళ్లకు మేతగా వేసే మొక్కజొన్న, సోయాబీన్ ధరలు పెరగడంతో పౌల్ట్రీ నిర్వహణ భారం పెరిగి పెంపకాన్ని తగ్గించారు. దీనికితోడు శుభ కార్యాలు, పెళ్లిళ్ల సీజన్ కావడంతో హోటళ్లు, ఫంక్షన్ హాళ్ల నుంచి ఆర్డర్లు పెరిగాయి. సప్లై తక్కువగా ఉండి, డిమాండ్ ఎక్కువగా ఉండటంతో రేట్లు ఆకాశాన్ని తాకుతున్నాయి.

## ఎస్ ఐ ఆర్‌ను త్వరగా పూర్తి చేయాలి

**తలకొండపల్లి, జులై 7, ప్రభాతవార్త :** తలకొండపల్లి మండలంలోని ఆయా గ్రామాల్లో ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎస్ఐఆర్ ను త్వరగా పూర్తి చేయాలని తలకొండపల్లి తాసిల్దార్ రమేష్ కుమార్ తెలిపారు. మంగళవారం నాడు తాసిల్దార్ కార్యాలయంలో మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, అంగన్వాడి టీచర్లు తో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల ప్రజలకు ఎస్ఐఆర్ పై అవగాహన కల్పించి త్వరగా ఫారం నింపే విధంగా చూడాలన్నారు. ఎస్ఐఆర్ విస్మరించిన వారికి ప్రభుత్వపరంగా వయోజన ఓటు హక్కు కోల్పోయే ప్రమాదం ఉందని, కావున మండలంలోని ప్రజలందరికీ తెలియజేసి పూర్తిచేయాలని సందర్భంగా ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక తహసిల్దార్ రమేష్ కుమార్ ఎంపీడీవో సీతా రామమ్మ, ఎంపీ ఓ, ఎంపీఓ ఆర్ఐలు, జిపిఓలు, పంచాయతీ కార్యదర్శులు, అంగన్వాడి టీచర్లు తదితరులున్నారు.

## ఎన్మకతల గ్రామంలో ఘనంగా మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలు



మంద కృష్ణ మాదిగ జయంతిని పురస్కరించుకొని వేడుకలు జరుపుకుంటున్న ఎన్మకతల నాయకులు.

**మోమిన్‌పేట్, జులై 7, ప్రభాతవార్త:** పద్మశ్రీ మందకృష్ణ జన్మదినాన్ని పురస్కరించుకొని మోమిన్‌పేట్ మండల పరిధిలోని ఎన్మకతల గ్రామంలో మాజీ సర్పంచ్ మీనపల్లి అనంతయ్య ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి ఆయన జన్మదిన వేడుకలను నిర్వ హించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతు మాదిగ సమాజిక న్యాయంకోసం మందకృష్ణ మాదిగ చేసినకృషి అందరిక ఆధర్శ ప్రాయమని కొనియాడారు. ఆయర ఆశయాలను ముందుకు తీసుకెళ్ళేందుకు ప్రతిఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్కతల అనంతయ్య, దప్పు పోచయ్య, కక్కెనిగారి కృష్ణరామయ్య, మాజీ ఉపసర్పంచ్ నర్సింలు, జనార్దన్, హన్మంత్, డప్పు శ్యాం, టీ. రమేష్, టీ. ఆనంద్, ఎస్. చిట్టిబాబు, అంబేద్కర్ అధ్యక్షులు చిట్టిబాబు, రమేష్‌కన్నయ్య, భరత్, ప్రభు, ధర్శన్, అనీల్, సమ్మయ్య, మల్లేశం తదిలరులు పాల్గొన్నారు.

## దళారీలకు నో ఎంట్రీ

(మొదటి పేజీ తరువాయి)

పెద్దగా సేవలు అందలేదనే విమర్శలు ఉన్నాయి. దీంతో గత్యంతరం లేక ప్రజలు బ్రోకర్లను ఆశ్రయించాల్సి వచ్చేది. డ్రైవింగ్ లైసెన్స్ ఇప్పించడం, రెన్యువల్ చేయించడం, వాహన ఫిట్‌నెస్, కొత్త వాహనాల రిజిస్ట్రేషన్ వంటి ఏ సేవ అయినా సరే బ్రోకర్ల ద్వారా వస్తేనే ఆఫీసుల్లో గ్రీన్ సిగ్నల్ లభించేదని సమాచారం. వీరు ప్రభుత్వ ఫీజుకు అదనంగా వసూలు చేస్తూ, ఆ సొమ్ములో అధికారులకు కూడా వాటాల పంపిణీ చేసేవారని ఆరోపణలు ఉన్నాయి. బ్రోకర్లకు వచ్చే ఆదాయం కంటే భారీ ఎత్తున అధికారులకే వారు అప్పగించేవారని తెలుస్తోంది. తాజాగా డీటీవో ప్రక్షాళనకు నడుం బిగించి, బ్రోకర్లను కార్యాలయంలోకి రాకుండా కట్టుదిట్టం చేయడంతో దళారులు తీవ్ర అయోమయానికి గురవుతున్నారు.

**ఓవర్ లోడ్ వాహనాలపై చర్యలు తీసుకోవాలి**

ఇలా ఉంటే, కేవలం కార్యాలయంలో బ్రోకర్లను మాత్రమే కట్టడి చేస్తే రవాణాశాఖ మొత్తాన్ని ప్రక్షాళన చేసినట్లు కాదని స్థానిక ప్రజలు అభిప్రాయపడుతున్నారు. జిల్లాలో ఉన్న ఖనిజ సంపదను తరలిస్తున్న వాహనదారులు నిబంధనలకు విరుద్ధంగా, కెపాసిటీకి మించి అధిక బరువుతో (ఓవర్ లోడ్) రవాణా సాగిస్తున్నారు. ఇలాంటి వాహనాల సంఖ్య నిత్యం వందల్లో ఉంటోంది. తాండూరు, వికారాబాద్, కొడంగల్ నియోజకవర్గాలలో ఉన్న ఖనిజాలు, సిమెంట్ రవాణా చేసే భారీ వాహనాలు, ట్యాంకర్లు నిత్యం రోడ్లపై తిరుగుతున్నాయి. ఎర్రమట్టి, నాపరాయి, సుద్ద, సిమెంట్ ట్యాంకర్ల ఓవర్ లోడింగ్ పై అధికారులు ఉక్కుపాదం మోపాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. గతంలో పనిచేసిన అధికారులు ఇలాంటి నిబంధనల ఉల్లంఘనలను పట్టించు కోకుండా, వాహనదారుల నుండి వచ్చే మామూళ్లతో తూతూ మంత్రంగా కేసులు నమోదు చేసి చేతులు దులుపుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ప్రతియేటా ఓవర్ లోడ్ పై నమోదు చేసిన కేసుల వివరాలను కూడా అధికారులు గోప్యంగా ఉంచేవారని, ఎక్కడో ఒకటి అరా కేసులు వెలుగులోకి వస్తేనే బహిర్గతం చేసేవారని సమాచారం. ఈ అక్రమ రవాణా వాహనాల ద్వారా ప్రతినెలా లక్షల్లో మామూళ్లు వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. దీనికోసం ప్రైవేట్ వ్యక్తులను నియమించుకుని మరీ అధికారులు దర్జాగా దందా సాగించారని ఆరోపణలు వచ్చాయి. కాబట్టి, కొత్తగా వచ్చిన డీటీవో గారు స్పందించి ఓవర్ లోడ్‌ను పూర్తిగా అరికట్టాలని, నిబంధనలు మీరిన వాహనాలకు భారీగా జరిమానాలు విధించడం ద్వారా ట్రాన్స్‌పోర్ట్ ఖజానాకు ఆదాయం సమకూర్చాలని ప్రజలు కోరుతున్నారు.

## ఇక మిగిలింది ఐదు రోజులే

(మొదటి పేజీ తరువాయి)

అదే రోజు సాయంత్రంలోపు పూర్తి చేయాలని కలెక్టర్ సూచిం చారు. బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌వోలు) ప్రజల నుంచి నింపిన ఫారాలను సకాలంలో సేకరించి వెంటనే సంబంధిత యాప్‌లో డిజిటలైజేషన్ ప్రారంభించాలని ఆదేశించారు. జిల్లాలోని ప్రతి అర్హత కలిగిన ఓటరు ముసాయిదా ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా, అనర్హులను జాబితా నుంచి తొలగించేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రానికి అవసరమైన ప్రత్యామ్నాయ సిబ్బందిని గుర్తించాలని, ఫారాల నింపడం, పరిశీలించడం, డిజిటలైజేషన్ పనుల్లో ఉపాధ్యాయులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాలల విద్యార్థులు, అదనపు సిబ్బంది, వాలంటీర్ల సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో కనీసం రెండు హెల్ప్‌డెస్కులు ఏర్పాటు చేసి ప్రజలకు అవసరమైన సహాయాన్ని అందించాలని ఆదేశించారు. ఎన్నికల నమోదు అధికారులు, సహాయ ఎన్నికల నమోదు అధికారులు ప్రతి పోలింగ్ కేంద్రంలో బలమైన బృందాలను ఏర్పాటు చేసి ప్రక్రియను సమర్థవంతంగా పర్యవేక్షి ంచాలని తెలిపారు. నేటి నుంచే గ్రామాలు, మున్సిపల్ వార్డుల స్థాయిలో ఎస్ఐఆర్ ఫారం ఫిల్లింగ్ మేళాలు నిర్వహించాలని, ఫారాల నిర్వహణలో పూర్తి పారదర్శకత పాటించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. బీఎల్‌వోలు ఫారాలను సక్రమంగా స్వీకరించి ప్రత్యేకంగా నియమించిన సిబ్బందితో పరిశీలింపజేసి అనంతరం సంబంధిత యాప్‌లో డిజిటలైజ్ చేసి భద్రపరచాలని ఆదేశించారు. ప్రతి దశకు సంబంధించిన మాన్యువల్ రికార్డులను కూడా తప్పనిసరిగా నిర్వహించాలని సూచించారు. ప్రతి రోజు కనీసం 20 శాతం పనులు పూర్తయ్యేలా కార్యాచరణ రూపొందించాలని, ఐదు రోజుల్లో లక్ష్యాన్ని చేరుకునేలా అధికారులు పనిచేయాలని సూచించారు. మండల స్థాయి సీనియర్ అధికారులు పోలింగ్ కేంద్రాలను వర్గీకరించి అవసరమైన చోట పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ ప్రక్రియను ప్రారంభించాలని ఆదేశించారు. ముసాయిదా ఓటరు జాబితా సిద్ధమైన అనంతరం రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి వారి అభిప్రాయాలను సేకరించాలని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ ప్రతి ఆర్డీవో, జోనల్ మున్సిపల్ కమిషనర్‌తో విడివిడిగా మాట్లాడి వారి కార్యాచరణ ప్రణాళికలను సమీక్షి ంచారు. నిర్దేశించిన గడువులో లక్ష్యాలను పూర్తి చేసేందుకు సమన్వయంతో పనిచేయాలని అధికారులను ఆదేశించారు.

# లక్షలాది మందికి 'తొలి ముద్ద'



నాచారంలో బాలామృతం కొత్త ప్లాంట్‌ను ప్రారంభించిన సిఎం

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, జులై 7 ప్రభాతవార్త:** రాష్ట్రంలోని గర్భిణీ స్త్రీలు, బాలింతలతోపాటు అంగన్‌వాడీ చిన్న పిల్లల ఆరోగ్య సంరక్షణే ధ్యేయంగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. అందులో భాగంగా మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా నాచారంలోని ఫుడ్ ఇండస్ట్రీస్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన బాలామృతం కొత్త ప్లాంట్‌ను రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి మంగళవారం లాంఛనంగా ప్రారంభించారు. కార్యక్రమానికి విచ్చేసిన ముఖ్యమంత్రి ముందుగా పరిశ్రమ ప్రాంగణంలో మొక్కలు నాటి పర్యావరణ స్పృహను చాటారు. అనంతరం అంచెలంచెలుగా ఒక పెద్ద పరిశ్రమగా ఎదిగిన ఈ నాచారం ఫుడ్స్ ఇండస్ట్రీస్‌లో కొత్త బాలామృతం ప్లాంట్‌ను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.

సీఎం రేవంత్ రెడ్డిఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. గర్భిణీ స్త్రీలకు, ఆడబిడ్డలకు, అంగన్‌వాడీ పిల్లలకు అందించే తొలిముద్ద బాలామృతం అని కొనియాడారు. వారికి నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందించాలనే సంకల్పంతోనే ఈ సరికొత్త ప్లాంట్‌ను అందుబాటులోకి తెచ్చామని ఆయన స్పష్టం చేశారు. తమ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి సంక్షేమ పథకంలోనూ మహిళలకే ప్రథమ ప్రాధాన్యత ఇస్తున్నామని ఈ సందర్భంగా సీఎం పునరుద్ఘాటించారు.

సంక్షేమ పథకాల అమలుతో పాటు, విద్యార్థుల చదువు, ప్రజా ఆరోగ్యంపై తమ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క, ప్రభుత్వ





సలహాదారు హర్కర వేణుగోపాల్, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.

వీరితో పాటు ఎమ్మెల్సీలు అద్దంకి దయాకర్, బల్మూర్ వెంకట్, తెలంగాణ ఫుడ్స్ చైర్మన్ ఫహీమ్, టిఎస్ఐఐసి చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి, డిసిసి అధ్యక్షులు వజ్రేశయాదవ్, ఉప్పల్ నియోజకవర్గ పార్టీ ఇన్చార్జి పరమేశ్వర్రెడ్డి మరియు పలువురు ఉన్నతాధికారులు, రాజకీయ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కొత్త ప్లాంట్ ప్రారంభం ద్వారా రాష్ట్రంలోని లక్షలాది మంది తల్లులకు, పిల్లలకు మరింత నాణ్యమైన పోషక విలువలు గల బాలామృతం సకాలంలో అందే అవకాశం కలగనుంది.

# కష్టపడి పనిచేసేవారికి కాంగ్రెస్‌లో పదవులు వరిస్తాయి

**పూడూరు, జులై 7, ప్రభాతవార్త :** కష్టపడి పనిచేసేవారికి కాంగ్రెస్ పార్టీలో పదవులు వరిస్తాయని పరిగి ఎమ్మెల్యే టి రామ్మోమన్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పూడూరు పిఎసిఎస్ కార్యాలయంలో నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారోత్సవం అనంతరం మండలకేంద్రంలోని కెజిబివి విద్యాలయంలో రూ.3. 25కోట్ల సమగ్ర అభియాన్ నిధులతో నిర్మించిన అదనపు గదులకు ప్రారంభంచి, పూడూరు గేట్‌నుండి గ్రామానికి హెచ్‌ఎండిఎ కింద రూ.8.95కోట్ల నిధులతో మంజూరి అయిన బిటి డబుల్‌రోడ్డుకు, రూ.20కోట్ల నిధులతో మంజూరి అయిన రంగాపూర్‌నుండి లాల్‌పహడ్ బిటి రోడ్డు పనులకు శంకుస్థాపన కార్యక్రమాలను నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని రోడ్ల అభివృద్ధికి రూ.320కోట్లు మంజూరి అయినట్లు వివరించారు. సిఎం రేవంత్‌రెడ్డి రైతుల పక్షపాతి అయినందునే ఎకరానికి రూ.6వేల చొప్పున ప్రతి రైతుకు రైతు భరోసాతోపాటు రైతు రణమాఫీ, రైతుభీమా వంటి పథకాలను అందిచడం జరుగుతుందన్నారు. విద్యాభివృద్ధికి పెద్దపీటవేసి పరిగిలో రూ.2వందల కోట్లతో ఇంటిగ్రేటెడ్ పాఠశాలను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. రూ 40కోట్లతో అంగడి చిట్టంపల్లి–లాల్‌పహడ్ డబుల్‌రోడ్డుకు నిధులు మంజూరి అయ్యాయన్నారు. కాంగ్రెస్ పార్టీలో పనిచేసే ప్రతి కార్యకర్తకు మంచి గుర్తింపు ఉంటుందని, పదవి రాలేదని నిరుత్సాహ పడకుండా పనిచేస్తే ప్రతిఒక్కరికి ఏదో పదవి ఇచ్చేందుకు కృషిచేస్తానని హామీ ఇంచారు. అనంతరం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 58మంది కళ్యాణలక్ష్మీ, షాదీముబారక్ లబ్దిదారులకు చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆత్మ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ పట్లోళ్ల రఘునాథ్‌రెడ్డి, వైస్ చైర్మన్ సురేందర్ ముదిరాజ్, తహశీల్దారు విజయకుమార్,



లబ్దిదారులకు చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, తదితరులు,

కాంగ్రెస్‌పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు కడుమూరు ఆనందం ,మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యక్షులు ఖిజర్‌పాష, సర్పంచులు భూపతిరెడ్డి, వీరేశం, గోపాల్, జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు అజీంపటేల్, శ్రీనివాస్, నాయకులు సుధాకర్‌రెడ్డి, శ్యాంసుందర్‌రెడ్డి, శాంకుమార్, ఎం సురేష్, అబ్రహం, పాల్గొన్నారు.



## ప్రమాణ స్వీకారం చేసిన పిఎసిఎస్ పాలకవర్గసభ్యులు

**పూడూరు, జులై 7, ప్రభాతవార్త :** పూడూరు ప్రాథమిక సహకార సంఘం(పిఎసిఎస్) చైర్మన్‌గా పూడూరు గ్రామానికి చెందిన పట్లోళ్ల రఘునాథ్‌రెడ్డి, వైస్ చైర్మన్‌గా ఎన్కెపల్లికి చెందిన సురేందర్ ముదిరాజ్, డైరెక్టర్లుగా కద్మూరుకు చెందిన సాయిప్రకాష్‌రెడ్డి, మంచన్ పల్లికి చెందిన యాదయ్య, అంగడి చిట్టంపల్లికి చెందిన చెన్నయ్యగౌడ్‌లు మంగళవారం పిఎసిఎస్ కార్యాలయంలో సిఇఓ ఖలీల్ ప్రమాణస్వీకారం చేయించారు. కంకల్ గ్రామానికి చెందిన మల్లేష్, మేడిపల్లి కలాన్‌కు చెందిన మేడికొండ యాదమ్మ, కండ్లపల్లికి చెందిన గౌసియా ఖాసీం, చెన్‌గోముల్ గ్రామానికి చెందిన రమేష్‌గౌడ్, నిజాంపేట్ మేడిపల్లికి చెందిన అమరేందర్‌రెడ్డి, పెద్ద ఉమ్మెంతల్‌కు చెందిన తిరుమ ల్‌రెడ్డి, సిహెచ్ క్రిష్ణ, తిర్మలాపూర్‌కు చెందిన రాములు నాయక్‌లు పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా పిఎసిఎస్ నూతన చైర్మన్ ప్రమాణస్వీకారం చేసిన పట్లోళ్ల రఘునాథ్‌రెడ్డి మాట్లాడుతూ అందరి సహకారంతో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. తనను నమ్మి పిఎసిఎస్ చైర్మన్ పదవికి నామినేట్ చేసిన సిఎం రేవంత్‌రెడ్డికి, ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డికి, పార్టీ కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలియజేశారు.

## చిలుక వాగుపై కొత్త కల్వర్టులు

**ప్రభాతవార్త, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :** జాతీయ రహదారిపై కల్వర్టు పూర్తి బెంగుళూర్ ముంబాయి రహదారికి తొలగిన అద్దంకి తాండూరు నుంచి మహబూబ్ నగర్ వెళ్లే మార్గంలో రూ. 30కోట్ల వ్యయంతో పట్టణం లో రహదారి విస్తరణ కార్యక్రమం చేపడుతున్నారు. అందులో భాగంగా చిలుక వాగు పై శిథిలమైన వంతెన స్థానంలో కొత్తగా విస్తరణ చేపట్టి నిర్మించారు. మంగళవారం రోడ్లు భవనాల శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రవణ్ నేతృత్వంలో పనులు పర్యవేక్షి ంచారు.

# సిద్దాపూర్‌లో డంపింగ్ యార్డ్ వివాదం

ఎమ్మెల్యేపై ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి ఆరోపణలు

**రంగారెడ్డి జిల్లా, షాద్‌నగర్:** నియోజకవర్గం కొత్తూరు మండల పరిధిలోని సిద్దాపూర్ గ్రామంలో ప్రతిపాదిత డంపింగ్ యార్డ్ ఏర్పాటును వ్యతిరేకిస్తూ రాజకీయ వాతావరణం మరింత వేడెక్కింది. జీవో 641ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్, బీజేపీ నాయకులు, స్థానిక ప్రజలు, రైతులు పెద్ద సంఖ్యలో షాద్ నగర్ మెయిన్ చౌరస్తా వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. డంపింగ్ యార్డ్ ఏర్పాటు వల్ల గ్రామ ప్రజల ఆరోగ్యం, పర్యావరణం, వ్యవసాయ భూములపై తీవ్ర ప్రభావం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, స్థానిక ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా ప్రభుత్వం ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకోవడం సరికాదన్నారు. ప్రజల జీవన ప్రమాణాలు, పర్యావరణ పరిరక్షణ, భవిష్యత్ తరాల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. ప్రజల వ్యతిరేకత ఉన్నప్పటికీ డంపింగ్ యార్డ్ ఏర్పాటుకు ప్రయత్నించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని ఆరోపించారు. డంపింగ్ యార్డ్ ఏర్పాటు జరిగితే సిద్దాపూర్‌తో పాటు పరిసర గ్రామాల ప్రజలు కాలుష్య సమస్యలు, దుర్వాసన, భూగర్భ జలాల కలుషితం, వ్యవసాయానికి నష్టం వంటి అనేక ఇబ్బందులను ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడుతుందని ఆయన పేర్కొన్నారు.

ప్రజల ఆరోగ్యానికి ముప్పు కలిగించే ప్రాజెక్టులను ప్రభుత్వం పునఃసమీక్షి ంచాలని, స్థానిక ప్రజల అభిప్రాయాలకు ప్రాధాన్యం ఇవ్వాలని డిమాండ్ చేశారు. జీవో 641ను తక్షణమే రద్దు చేసి, సిద్దాపూర్‌లో డంపింగ్ యార్డ్ ఏర్పాటుపై ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి డిమాండ్ చేశారు. ప్రజల తరఫున తమ పోరాటం కొనసాగుతుందని, అవసరమైతే అన్ని ప్రజా సంఘాలను ఏకతాటిపైకి తీసుకొచ్చి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో బీఆర్ఎస్, బీజేపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, రైతులు, మహిళలు, యువకులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వం వెంటనే స్పందించాలని వారు డిమాండ్ చేశారు.

# నేరాల నియంత్రణకు సిసి టివి కెమెరాలు కీలకం: సిఐ

**ఘట్‌కేసర్, జులై 7, ప్రభాతవార్త:** శాంతి, భద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణకు ప్రజల భద్రతలో సీసీ టీవీ కెమెరాలు ఎంతగానో దోహదం చేస్తాయని ఘట్‌కేసర్ ఇన్‌స్పెక్టర్ ఎం.బాలస్వామి అన్నారు. ఘట్‌కేసర్, కొండాపూర్, ఎదులాబాద్, అవుషాపూర్‌లలో నేను సైతం 2.0 కార్యక్రమాన్ని నిర్వహించారు. మల్కాజ్‌గిరి కమిషనర్ సుమతి ఆదేశాల మేరకు ఘట్‌కేసర్ పోలీసులు సీసీ టీవీ కెమెరాల ఉపయోగాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా సీఐ బాలస్వామి ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని వివిధ కాలనీల్లో దాదాపు వంద సిసి టీవీ కెమెరాలను ప్రారంభించి మాట్లాడుతూ ఆధునిక కాలంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకొని ఇళ్లను, వ్యాపార సంస్థలను, సమాజాన్ని సురక్షితంగా చూసుకోవడానికి తగిన ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమని 24 గంటల పాటు నిరంతరాయంగా పనిచేస్తూ వంద మంది పోలీసుల విధులతో సమానమైన భద్రతను అందిస్తుందని తెలిపారు. నిఘా కెమెరాలు ఉన్నాయని తెలియగానే దొంగలు, గుర్తుతెలియని వ్యక్తులు నేరాలు చేయడానికి వెనుకాడుతారని, అవాంఛనీయ సంఘటన, దొంగతనం జరిగినప్పుడు నిందితులను త్వరగా గుర్తించడానికి, కోర్టులో నిరూపించడానికి సీసీ టీవీ ఫుటేజ్ బలమైన సాక్ష్యంగా నిలుస్తుందని ఆయన వివరించారు. ప్రజలు తమ ఇళ్లు దుకాణాలు, అపార్ట్‌మెంట్స్ వద్ద కెమెరాలు ఏర్పాటు చేసుకునేటప్పుడు కేవలం నాణ్యమైన అధీకృత కెమెరాలనే అమర్చుకోవాలని,



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ బాలస్వామి

కెమెరా యాంగిల్ రోడ్డు, ఇంటి వైపు ఉండేలా చూసుకోవాలని సూచించారు. నేను సైతం 2.0 అనే నినాదంతో ప్రతి వ్యాపారస్తుడు ప్రతి ఇంటిటి యాజమాని, కాలనీ అసోసియేషన్లు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సీసీ టీవీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని, కాలనీలు సురక్షితంగా మార్చడంలో భాగస్వాములు కావాలని సీఐ విజ్ఞప్తి చేశారు. ఈకార్యక్రమంలో డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ఎస్ఐలు బి.ప్రభాకర్‌రెడ్డి, ఎ.శేఖర్, రాఘవేంద్ర, షేక్‌హీనా, సిబ్బంది, పలు కాలనీల ప్రజలు పాల్గొన్నారు.

## మీ నమ్మకమే నన్ను మంత్రిని చేసింది

(మొదటి పేజీ తరువాయి)

ఆధునీకరణ, రహదారుల విస్తరణ వంటి అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా కొనసాగుతున్నాయని చెప్పారు. అలాగే రూ.2,300 కోట్లతో సమీకృత మార్కెట్ ఏర్పాటు ద్వారా వేలాది మందికి ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు వెల్లడించారు. తెలంగాణ రాష్ట్రరోడ్డు అభివృద్ధి సంస్థ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి మాట్లాడుతూ సంక్షేమంతో పాటు అభివృద్ధికి కూడా రాష్ట్ర ప్రభుత్వం సమాన ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రధాన రహదారులను నాలుగు లేన్లుగా అభివృద్ధి చేయడం ద్వారా రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు పెరిగి ప్రాంతీయ అభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందని పేర్కొన్నారు.

**కాంగ్రెస్ అధ్యక్షులకు నియామకపత్రాలు అందజేత**

**ఘట్‌కేసర్, జులై 7, ప్రభాతవార్త:** మేడ్చల్ నియోజక వర్గంలోని డివిజన్ కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులుగా నియమితులైన వారికి మేడ్చల్ డిసిసి అధ్యక్షులు తోటకూర వజ్రేశ్‌యాదవ్ నియా మకపు పత్రాలను అందజేశారు. ఘట్‌కేసర్ సర్కిల్ పరిధిలోని నాలుగు డివిజన్లకు గాను ఘట్‌కేసర్ డివిజన్ అధ్యక్షులుగా బొక్క ప్రభాకర్‌రెడ్డి, ఎదులాబాద్ డివిజన్ అధ్యక్షులుగా సామల అమరేందర్, పోచారం డివిజన్ అధ్యక్షులుగా క్రరె రాజేశ్‌లను డిసిసి ఆమోదంతో టీపీసీసీ అధ్యక్షులు మహేశ్‌కుమార్‌గౌడ్ నియమిస్తూ ఉత్వర్వులు జారీ చేశారు.

## ప్రతి విషయాన్నీ రాజకీయం చేయొద్దు

(మొదటి పేజీ తరువాయి)

భూమిపూజ నిర్వహించిన అనంతరం, ఆయన భూభారతి (భూ రీసర్వే)పై నిర్వహించిన గ్రామ సభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ, అసెంబ్లీలో జరిగిన చర్చల పట్ల ప్రతిపక్ష నేతలు చేస్తున్న విమర్శలను తిప్పికొట్టారు. అసెంబ్లీలో చర్చ జరిగిన సమయంలోనే రాష్ట్రంపై 8 లక్షల 16 వేల కోట్ల రూపాయల అప్పు ఉన్నట్లు తేలిందని, గత ప్రభుత్వ హయాంలో చేసిన అప్పులపై జరిగిన వాస్తవాలను పక్కనపెట్టి, బయట సమావేశాల్లో అబద్ధాలు ప్రచారం చేయడం సరికాదని ఆయన హితవు పలికారు. ఎమ్మెల్యే డిస్‌క్వాలిఫై విషయంలో 54 పేజీల జడ్జిమెంట్ కాపీని చదువుకొని మాట్లాడితే మంచిదని, ప్రతి విషయాన్ని రాజకీయం చేయొద్దని స్పీకర్ సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం భూ సమస్యల పరిష్కారం కోసం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ సర్వే ప్రక్రియ వల్ల భవిష్యత్తులో భూతగాదాలు పూర్తిగా తగ్గుతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సర్వే ద్వారా గ్రామంలోని పొలాలతో పాటు గ్రామకంఠం, ఇంటి స్థలాల సరిహద్దులను నిర్ణయించడం జరుగుతుందన్నారు. రైతులు పండించిన పంటలను నిల్వ చేసుకునేందుకు గోదాముల నిర్మాణానికి కృషి చేస్తామని, రైతుబంధుతో పాటు వ్యవసాయ యంత్రాలు, ఎరువులను సబ్సిడీపై అందిస్తున్నామని తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టి సారించిన ప్రభుత్వం, కోట్‌పల్లి ప్రాజెక్టు అభివృద్ధికి 90 కోట్ల రూపాయలు మంజూరు చేయగా అందులో 60 కోట్ల పనులు ఇప్పటికే చేపట్టామని, సర్పన్‌పల్లి ప్రాజెక్టు కోసం 30 కోట్ల రూపాయలు మంజూరు చేశామని ఆయన వివరించారు. అలాగే, నియోజకవర్గంలో రోడ్ల అభివృద్ధి కోసం పంచాయతీరాజ్ శాఖకు 300 కోట్లు, ఆర్ అండ్ బి రోడ్లకు 450 కోట్ల రూపాయల నిధులు మంజూరు చేసినట్లు స్పీకర్ వెల్లడించారు. అనంతరం మోమిన్ కుర్దు గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇండ్లను ప్రారంభించి, లబ్ధిదారులైన దంపతులకు నూతన ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకటాచారి, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడి మధుసూదన్, తహసిల్దార్ సాజిదా బేగం, సీఈఓ నర్సింలు, ఏఐసీసీ రాష్ట్ర యువజన సంఘం కార్యదర్శి సంతోష్, పిఎసిఎస్ చైర్మన్ సత్యనారాయణ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్ భాస్కర్ రెడ్డి, గాఫర్, యూనస్ , అమర్ పటేల్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE HON'BLE III ADDL JUNIOR CIVIL JUDGE-CUM X ADDL JUDICIAL MAGISTRATE OF FIRST CLASS:AT MEDCHAL

O.S.No. 464 of 2026

Between:
1) **Modapothula Mercy Bhagyavalli,** W/o. Late Bolle Johnson Pramod Kumar
2) **Bolle Havila Onyx** D/o. Late Bolle Johnson Pramod Kumar
3) **Bolle Simeon Dyva Krupa** S/o. Late Bolle Johnson Pramod Kumar
4) **B. Sundaraiah** S/o Late B.B. Sundaram
All R/o. H.No. 32-431/C, HMT Society, Shapur Nagar, IDA Jeedimetla, Qutubullapur-500055
...Plaintiffs

And

1) **The Mandal Revenue Officer,** Mandal Revenue Office, Qutubullapur Mandal,
2) **All Concerned** ...Defendants

To
**All Concerned** ...Defendant

Please take notice that the above Plaintiffs have filed the above OS No. 464 of 2026 for declaration of legal heir. The above case is posted on **24/8/2026** for your appearance and if any person who are having objection may appear at **10.30 AM** before this Hon'ble Court personally or through your counsel. In case if you fail to appear, the matter will be decided in your absence.

(BY ORDER OF THE HON'BLE COURT)

**M. Pushpalatha**
**Shaik Sha Vali**
**G.M. Uma Maheswari**
**Advocates**
H.No.6-5-534, New Bhoiguda, Secunderabad. **Ph: 9849115830**

IN THE COURT OF THE HON'BLE III ADDL JUNIOR CIVIL JUDGE-CUM X ADDL JUDICIAL MAGISTRATE OF FIRST CLASS:AT MEDCHAL

O.S.No. 460 of 2026

Between:
1) **Palla Sudhakar Reddy** S/o. Late Palla Ramachandra Reddy
2) **Gaddam Jayanthi** W/o. Gaddam Ramesh, D/o. Late Palla Rama Chandra Reddy R/o. H.No.32-432/3, Lal Bahadur Nagar, Shapur Nagar, IDA Jeedimetla, Qutubullapur-500055
3) **Gaddam Jyothi** W/o. G. Gandhi, D/o. Late Palla Ramachandra Reddy
Plaintiff No.1 and 3 are residing at R/o. H.No. 32-431, Plot No. 347, LB Nagar, Shapur Nagar, IDA Jeedimetla, Qutubullapur-500055
...Plaintiffs

And

1) **The Mandal Revenue Officer,** Mandal Revenue Office, Qutubullapur Mandal
2) **All Concerned** ...Defendants

To
**All Concerned** ...Defendant

Please take notice that the above Plaintiffs have filed the above OS.No. 460 of 2026 for declaration of legal heir. The above case is posted on **24/8/2026** for your appearance and if any person who are having objection may appear at **10.30 AM** before this Hon'ble Court personally or through your counsel. In case if you fail to appear, the matter will be decided in your absence.

(BY ORDER OF THE HON'BLE COURT)

**M. Pushpalatha**
**Shaik Sha Vali**
**G.M. Uma Maheswari**
**Advocates**
H.No.6-5-534, New Bhoiguda, Secunderabad. **Ph: 9849115830**



# రాక్‌బాల్ జాతీయ క్రీడాకారుడిని సన్మానించిన ఎంపి ఈటల

**మేడ్చల్, జులై 7, ప్రభాతవార్త :** నేపాల్‌లోని ఖాట్మండులో నిర్వహించిన దక్షిణాసియా రాక్‌బాల్ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్‌లో నేపాల్ పై ఘన విజయం సాధించిన భారత జట్టులో సభ్యుడైన మేడ్చల్ జిల్లా పూడూరు గ్రామానికి చెందిన ఇటబోయిన గోపాల్ యాదవ్‌ను మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ సన్మానించారు. మంగళవారం రాక్ బాల్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సునీల్ కుమార్, తెలంగాణ టీమ్ కోచ్ చిట్కుల లక్ష్మణ్‌లతో కలసి గోపాల్ యాదవ్ ఎంపీ ఈటలను నివాసానికి వెళ్లి ఆయనను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గోపాల్ యాదవ్‌ను ఎంపి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు అనిల్ యాదవ్, పరమేశ్, లక్ష్మణ్, శ్రీశైలం, సాయిబాబు తదితరులు ఉన్నారు.



ఎంపీ ఈటల రాజేందర్‌ను కలిసిన రాక్‌బాల్ భారత జట్టు సభ్యుడు గోపాల్ యాదవ్

# పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు



మాజీ ఎంపీటీసీ బాలప్పపై వేటు వేసిన కాంగ్రెస్ మండల అధ్యక్షులు

**ధారూర్ , జులై 7, ప్రభాత వార్త:** పార్టీ నిబంధనలను అతిక్రమించే నాయకులపై కఠినంగా వ్యవహరిస్తామని ధారూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మాన్సింగ్ హెచ్చరించారు. పార్టీ క్రమశిక్షణను దెబ్బతీసేలా, మండల పరిధిలోని నాగసమందర్ మాజీ ఎంపిటిసి బాలప్ప వ్యవహరించిన తీరుపై పార్టీ అధిష్ఠానం దృష్టి సారించగా, ఆయనను పార్టీ ప్రాథమిక సభ్యత్వం నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు మాన్సింగ్ ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పార్టీ నియమావళికి విరుద్ధంగా మాజీ ఎంపిటిసి బాలప్ప చేపట్టిన కార్యకలాపాల వల్లే ఈ నిర్ణయం తీసుకున్నట్లు స్పష్టం చేశారు. సస్పెన్షన్ అమల్లో ఉన్నంత కాలం, బాలప్ప పార్టీ కార్యకలాపాలకు, సమావేశాలకు దూరంగా ఉండాలని పార్టీతో ఎలాంటి సంబంధం లేకుండా ఉండాలని ఆదేశించారు. పార్టీ ప్రతిష్టను కాపాడటానికి క్రమశిక్షణ చర్యలు అత్యవసరమని ఆయన పేర్కొన్నారు.

# పార్టీ ఆశయాలు, సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేయాలి



పదవులు చేపట్టిన నాయకులను సన్మానించిన ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

**ఆమనగల్లు, జులై 7, ప్రభాతవార్త:** పదవులు మరింత బాధ్యతలను పెంచతాయని, సిద్ధాంతాలు, ఆశయాలకనుగుణంగా పనిచేస్తూ వాటిని సమర్థవంతంగా నిర్వర్తించాలని కల్వకుర్తి శాసనసభ్యుడు కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. శతాబ్ది చరిత్ర కల్గిన కాంగ్రెస్ పార్టీ నిరంతరం పేదల సంక్షేమాభివృద్ధి కొరకు పనిచేస్తుందని చెప్పారు. డిసిసితోపాటు పలు మండలాల పదవులు అధిరోహించిన కల్వకుర్తి నియోజకవర్గ నేతలతో బుధవారం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసంధర్భంగా వారిని శాలువాతో సత్కరించి అభినందించారు. ఈమేరకు ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న ప్రజాపాలన రాష్ట్ర పురోగతికి ఎంతగానో దోహదపడుతుందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని చెప్పారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేర్చి విపక్షాల కుట్రలను ప్రజలకు వివరించవలసిన బాధ్యత పార్టీ శ్రేణులు స్వీకరించారన్నారు. విద్యారంగానికి పెద్దపీట వేస్తున్న రేవంత్‌రెడ్డి సర్కారు రాష్ట్రంలో తెలంగాణ పబ్లిక్ స్కూల్, ఇంటిగ్రేటెడ్, గురుకులాల బలోపేతానికి కృషి చేస్తున్నారన్నారు. రైతుబంధు పథకం అమలు తీరును ప్రజలకు పూర్తిగా వివరించాలని కోరారు. అలాగే ఇందిరమ్మ ఇళ్ళు పథకంతో నేడు ఎంతోమంది సొంతింటి కలను సాకారం చేసుకున్నారన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు ఆయిళ్ళ శ్రీనివాస్‌గౌడ్, డిసిసిఉపాధ్యక్షుడు గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రేస్ అధ్యక్షుడు యాట నర్సింహ్మా ముదిరాజ్, అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు అవ్వారి శివలింగం, నాయకులు జగన్, మానయ్య తదితరులు ఉన్నారు.

**ఆమనగల్లు కాంగ్రేస్‌కు కొత్త సారథులు...**

ఆమనగల్లు మండల కాంగ్రేస్ పార్టీకి టీపీసీసీ కొత్త సారథులను నియమించింది. పాత పాలకవర్గం స్థానంలో కొత్త వారిని నియమిస్తూ టీపీసీసీ ఆధ్వర్యంలో అందుకు సంబంధించిన జాబితాను అధికారికంగా విడుదల చేసింది. మండల పార్టీ అధ్యక్షుడుగా పోలెపల్లి గ్రామానికి చెందిన శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపాలిటీ 15వవార్డుకు చెందిన పట్టణ అధ్యక్షుడిగా అవ్వారి శివలింగంను నియమించారు. వీరు గత కొంతకాలంగా అధికార కాంగ్రేస్ పార్టీలో చురుకుగా పనిచేస్తున్నారు. ఈసందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి, అవ్వారి శివలింగంలు మాట్లాడుతూ తమ ఎంపిక పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ ఎంపికకు సహకరించిన స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, సిడబ్ల్యూసి ప్రత్యేక ఆహ్వానితులు చల్లా వంశీచంద్‌రెడ్డి, టిపిసిసి అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, డిసిసి అధ్యక్షుడు చల్లా నర్సింహ్మారెడ్డిలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తమ పట్ల పార్టీ పెట్టుకున్న విశ్వాసానికి అనుగుణంగా విధులు నిర్తిస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని చెప్పారు.

# ఎస్ఐఆర్‌లో బూతుస్థాయి ఏజెంట్లు భాగస్వాములు కావాలి

**వికారాబాద్,ప్రభాతవార్త :** ఎస్ఆర్ఐ ప్రక్రియలో బూతు స్థాయి ఏజెంట్లు అందరూ భాగస్వాములు కావాలని శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ తెలిపారు. మంగళవారం పట్టణంలోని సత్య భారతి ఫంక్షన్ హాల్లో ప్రత్యేక సమగ్ర సవరణపై వికారాబాద్ మున్సిపాలిటీ బూతు స్థాయి ఏజెంట్లు, మున్సిపల్ కౌన్సిలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యతిథిగా ఆయన పాల్గొని మాట్లాడుతూ, అర్హులైన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదయ్యే విధంగా చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఎస్ఐఆర్ ప్రక్రియను విజయవంతం చేయాలని ఆయన సూచించారు. ఎస్ఆర్ఐ ప్రక్రియ సజావుగా జరిగే విధంగా బిఎల్ఎ లు, యువత అధికారులకు సహకరించాలని ఆయన తెలిపారు. గ్రామాల్లో, మున్సిపల్ పరిధిలో అర్హులైన ప్రతి ఒక్కరిని ఓటర్ కార్డ్ నమోదు అయ్యేవిధంగా ప్రజా ప్రతినిధులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆయన సూచించారు. ప్రతి ఓటర్ కు ఎన్యూమరేషన్ ఫారాలు అందే విధంగా బిఎల్ఎ లు, బిఎల్ఓ లు సమన్వయంతో పని చేయాలని సభాపతి సూచించారు. ఈ సమావేశంలో తహసిల్దార్ లక్ష్మీ క్మనారాయణ, మున్సిపల్ వైస్ చైర్మన్ సుధాకర్ రెడ్డి, ఎస్ఐఆర్ ట్రెనింగ్ కోఆర్డినేటర్ చైతన్య కృష్ణారెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు, బూతు స్థాయి ఏజెంట్లు పాల్గొన్నారు.



ఎస్ఐఆర్ అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

# జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోషల్ ఆడిట్

**శామీర్‌పేట, జులై 7, ప్రభాతవార్త:**

దేవరయాంజాల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోషల్ ఆడిట్ కార్యక్రమం జరిగింది. మంగళవారం మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలోని కీసర సర్కిల్, శామీర్‌పేట డివిజన్ పరిధిలోని దేవరయాంజాల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోషల్ ఆడిటర్ గోపి ఆధ్వర్యంలో సోషల్ ఆడిట్ కార్యక్రమంను నిర్వహించారు. పాఠశాలలో అమలు అవు తున్న ప్రభుత్వ పథకాలు, విద్యా ప్రమాణాలు,పథకాలు, మౌళిక వస తులు, విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలు, పాఠశాల నిర్వాహణ, పలు అంశాలను సమగ్రంగా పరిశీలించారు. ఆడిట్ సందర్భంగా పాఠశాల రికార్డులను పరిశీలించి విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజనపథకం, పరిశుభ్రత, విద్యా నాణ్యత, పాఠశాల అభివృద్ధికి చేపడుతున్న కార్య క్రమాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల అభివృద్ధికి అవస రమైన సూచనలు అందించి ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలు విద్యార్థులకు సమర్థవంతంగ చేరేలా కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగ పాల్గొన్న ప్రజాప్రతినిధులు, తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠ శాలల్లో విద్యా ప్రమాణాల పెంపు, విద్యార్థులకు మెరుగైన సౌకర్యాల కల్పనకు ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. సోషల్ ఆడిట్ ద్వారా పాఠశాల నిర్వాహణలో పారదర్శకత, జవాబుదారీ తనం మరింత పెరుగు తుందని వారు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాలేశ్, జిల్లా ఆర్టీఏ మెంబర్ భీమిడి జైపాల్‌రెడ్డి, ఈ అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ కట్ట మీనాకుమారి, రామాలయం మాజీ ధర్మకర్త పి.నరింహ్మారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల అభివృద్ధి కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



దేవరయాంజాల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోషల్ ఆడిట్ కార్యక్రమం నిర్వహించగా పాల్గొన్న హెచ్ఎం బాలేశ్, జిల్లా ఆర్టీఏ మెంబర్ బి.జైపాల్‌రెడ్డి, తదితరుల దృశ్యం

## సిఎం ఇలాకాలో అప్రకటిత విద్యుత్ కోతలు

**కొడంగల్,జులై 7,ప్రభాతవార్త:**

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రాతినిత్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గ కేంద్రంలో అప్రకటిత విద్యుత్ కోతలు కొనసాగు తున్నాయి.ప్రతి రోజు గంటల తరబడి విద్యుత్ సరఫరాలో తరుచు అంత రాయం ఏర్పడుతుండడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ఒకపక్క అనధికారికంగా రెప్పపాటు కూడా విద్యుత్ కోతలు విధించరాదని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు జారీ చేసినా కొడంగల్ విద్యుత్ అధికారులు సీఎం ఆదేశాలను భేఖాతరు చేస్తున్నారు.మరోపక్క కొడంగల్ పట్టణంలో నూతన విద్యుత్ స్థంబాలు ఏర్పాటు చేయడంతో ఎలాంటి అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా కొనసాగాల్సి ఉన్నా ఎలాంటి సమాచారం లేకుండా నిత్యం విద్యుత్ కోతలు విధిస్తుండడంతో ప్రజలు తీవ్రంగా మండిపడుతున్నారు.ఏ చిన్న పాటి గాలి వీచినా విద్యుత్ సరఫరాను నిలిపివేస్తుండడంతో పట్టణవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఇటీవలే కడా కార్యాలయంలో కలెక్టర్ సమక్షంలో జరిగిన సీమీక్షా సమావేశంలో విద్యుత్ అధికారుల తీరుపై ఏకంగా మున్సిపల్ చైర్మేన్ నందారం ప్రశాంత్ ఆగ్రహం వ్యక్తం చేసినా విద్యుత్ అధికారుల్లో ఎలాంటి మార్పు కనబడడం లేదని ప్రజలు మండిపడుతున్నారు.విద్యుత్ కోతలపై సంభందిత శాఖ ఏఈకి ఫోన్ చేసినా కనీసం ఫోన్ కూడా ఎత్తడం లేదని మున్సిపల్ చైర్మేన్ మండిపడ్డారు.ఇప్పటికైనా కొడంగల్‌లో అప్రకటిత విద్యుత్ కోతలు విధంచకుండా నిరంతర విద్యుత్ సరఫరా జరిగేలా విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు తగు చర్యలు తీసుకోవాలని పట్టణవాసులు డిమాండ్ చేస్తున్నారు.

**దౌల్తాబాద్ మండల ఉపసర్పంచుల సంఘం నూతన కమిటీ ఏర్పాటు**

**దౌల్తాబాద్,జులై 7,ప్రభాతవార్త:** ఉపసర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు రాములునాయక్ ఆదేశాల మేరకు,వికారాబాద్ జిల్లా ఉపసర్పంచుల సంఘం అధ్యక్షులు ఎస్.గోపాల్ ఆధ్వర్యంలో దౌల్తాబాద్ మండల కేంద్రంలో మంగళవారంరోజు మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ సంధర్భంగా జిల్లా అధ్యక్షులు ఎస్.గోపాల్ నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులకు నియామక పత్రాలను అందజేసి అభినందనలు తెలిపారు.

ఈ కమిటీ మండల అధ్యక్షులుగా పటోళ్ల నాగరాజు(నాగిరెడ్డి) ఎన్నికయ్యారు.గౌరవాధ్యక్షులుగా సావిత్రమ్మ,గోపాల్, ఉపాధ్యక్షులుగా చంద్రప్ప,శామప్ప,రాజు,వర్కింగ్ ప్రెసిడెంట్‌టుగా అంబయ్య,ఈ.అశోక్, ప్రధాన కార్యదర్శులుగా శివలత,ఆంజనేయులును ఎన్నుకున్నారు.ఈ సంధర్భంగా ఉపసర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్.గోపాల్ మాట్లాడుతూ..ఉపసర్పంచుల హక్కుల పరిరక్షణ,వారి ఆత్మగౌరవాన్ని కాపాడుకోవడం,ఐక్యతను చాటడం,గ్రామాభివృద్ధిలో కీలక పాత్ర పోషించడం లక్ష్యంగా మండలంలోని ఉపసర్పంచులందరూ సమష్టిగా పని చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మండలంలోని పలువురు ఉపసర్పంచులు పాల్గొని నూతన కమిటీకి మద్ధతు తెలిపారు.





# ముచ్చింతల్‌లో స్టాచ్యూ ఆఫ్ ఈక్వాలిటీని దర్శించుకున్న గవర్నర్ సతీమణి

**శంషాబాద్, జులై 7,ప్రభాతవార్త :** గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా సతీమణి జానకి శుక్లా మంగళవారం ఉదయం శంషాబాద్ మండలపరిధిలోని ముచ్చిం తల్‌లో కొలువై ఉన్న స్టాచ్యూ ఆఫ్ ఈక్వాలిటీని సందర్శించారు.ఈ సందర్భంగా ఆమె రామానుజాచార్యుల విగ్రహాన్ని భక్తిశ్రద్ధలతో దర్శించు కున్నారు. ఆలయ ప్రాంగణంలోని 108 దివ్య దేశాలను, ఆధ్యాత్మిక వాతా వరణాన్ని ఆమె ప్రత్యేకంగా పరిశీలించారు. ఆలయ నిర్వాహకులు ఆమెకు ఘన స్వాగతం పలికి, రామానుజాచార్యుల విశిష్టతను మరియు ఈ క్షేత్రం యొక్క ప్రాముఖ్యతను వివరించారు. ఈ ఆధ్యాత్మిక పర్యటనలో ఆమె శ్రీ రామానుజాచార్యుల బోధనల పట్ల ఆసక్తిని కనబరిచారు.

# వైద్యసేవలకు చిరునామా మెడిసిటి





విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మెడిసిటి గ్రూపు ఆఫ్ హాస్పిటల్స్ సీఈఓ ఐనిష్ మర్చంట్

**మేడ్చల్,జులై 7, ప్రభాతవార్త:** వైద్య సేవలలో నాణ్యతను పరీక్షించి సర్టిఫికేట్ అందించే నాభ్ గుర్తింపును ఎల్లంపేట మున్సిపల్ పరిధిలోని ఘన్‌పూర్‌లో గల మెడిసిటి ఇన్సిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ సాధించింది.

ఈ సందర్భంగా మంగళవారం మెడిసిటి ఇన్సిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మెడిసిటి గ్రూపు ఆఫ్ హాస్పిటల్స్ సీఈఓ ఐనిష్ మర్చంట్ మాట్లాడుతూ వైద్య సేవలలో నాణ్యత అనేది నిరంతరం కొనసాగే ప్రక్రియ అని అన్నారు. ఈ దిశగా నేడు మెడిసిటి ఇన్సిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌కు చెందిన అనుబంధ మెడిసిటి హాస్పిటల్‌లో నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు పట్టుదలతో పని చేసి నాభ్ గుర్తింపు సాధించామని ప్రకటించారు. ఈ గుర్తింపు గత కొన్ని సంవత్సరములుగా వైద్య సేవలలో నాణ్యతను పెంపొందించడానికి సంస్థ చేస్తున్న కృషికి నిదర్శనమన్నారు.

తెలంగాణాలో ఉన్న మెడికల్ కాలేజీ అనుబంధ హాస్పిటల్స్‌లో నాభ్ గుర్తింపు సాధించిన అతి కొద్ది సంస్థలలో మెడిసిటి ఒకటిగా నిలుస్తుందన్నారు.

అనంతరం మెడిసిటి ఇన్సిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ కె శివరామకృష్ణ మాట్లాడుతూ లాభాపేక్ష లేకుండా 1990వ ప్రాంతంలో స్థాపించిన మెడిసిటి సంస్థ నేడు దిన దినాభివృద్ధి చెందుతూ రోగులకు నాణ్యమైన సేవలతో పాటూ అత్యాధునిక చికిత్స అందించడంలో పేరు గడించిందని వివరించారు.

దీనికి కొనసాగింపుగా ఇపుడు నాభ్ అక్రిడేషన్ సాధించడంతో నాణ్యమైన సేవలను నిరంతరాయం కొనసాగించాల్సిన బాధ్యత మరింత పెరిగిందని, భవిష్యత్తులో మరిన్ని సేవలు అందించడానికి అవసరమైన చర్యలు తీసుకొంటున్నామని ప్రకటించారు.మెడిసిటి గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ ప్రిన్సిపల్ దేవేంద్ర సింగ్ నేగి, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

# గుండ్లపోచంపల్లిలో సైబరాబాద్ కమిషనర్ సృజన పర్యటన..



సమస్యలను తెలుసుకుంటున్న సిఎంసి కమిషనర్ సృజన

**మేడ్చల్, జులై 7,ప్రభాతవార్త :** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వన్ వార్డు ఎ డే కార్యక్రమంలో భాగంగా మంగళవారం మేడ్చల్ సర్కిల్‌లోని గుండ్లపోచంపల్లి డివిజన్‌ను ఆ కార్పోరేషన్ కమిషనర్ జి. సృజన సందర్శించారు. ఈ సందర్భంగా గుండ్లపోచంపల్లి డివిజన్‌లో రోడ్ల దుస్థితి, డ్రైనేజీ సమస్యలు, వీధి దీపాల కొరత, చెరువులోకి మురుగునీరు చేరడం వంటి సమస్యలను స్థానిక ప్రజలు, ప్రజాప్రతినిధులు కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. గుండ్లపోచంపల్లి డివిజన్ జీహెచ్ఎంసీలో విలీనమైన తర్వాత అభివృద్ధికి దూరమైందని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ డివిజన్‌లో నెలకొన్న సమస్యలతో పాటు ప్రజలకు కావాల్సిన అవసరాలను ప్రత్యక్షంగా తెలుసుకుని వాటి పరిష్కారానికి కార్యాచరణ రూపొందించడానికే ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తదనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేసి దశలవారీగా పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఆమె హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్ పింకేష్ కుమార్, బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు విక్రంరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మోహన్‌రెడ్డి, కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు సురేందర్ ముదిరాజ్, మాజీ సర్పంచ్ ఈశ్వర్, నాయకులు మోహన్, వెంకటేష్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## యూత్, బిఎల్ఏలు ఓటరు ఫామ్స్ నింపటానికి సహకరించాలి

**శామీర్‌పేట మండల తహసీల్దార్ శ్రీనివాస్**

**శామీర్‌పేట, జులై 7, ప్రభాతవార్త:**

ఎస్ఐఆర్ కార్యక్రమంపై గ్రామాల్లోని యూత్, బిఎల్ఏలు ఓటరు ఫామ్స్‌ను నింపటానికి ఓటర్లకు సహకరించాలని శామీర్‌పేట మండల తహసీల్దార్ శ్రీనివాస్ సూచించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం గ్రామాల్లో జరుగుతున్న ఎస్ఐఆర్‌లో భాగంగా ప్రతి ఓటరుకు ఎన్నికల కమిషన్ ఫారములు పంపిణీ చేయటం జరిగిందన్నారు. వాటిని తిరిగి 2002సంవత్సరం ఓటరు లీస్టు వివరాలతో పూరించి ఒక పాస్‌పోటో సైజు జత చేసి సంబంధిత బిఎల్ఓలకు ఇవ్వాలని అన్నారు. దీని కోసం గ్రామాల్లో యువతను, రాజకీయ పార్టీల బిఎల్ఏలను ప్రతి ఓటరు ఫారం నింపి బిఎల్ఓలకు తిరిగి ఇచ్చే విధంగా చూడాలని, ఒక వేళ ఓటరు ఫారమ్ తిరిగి ఇవ్వని యెడల వారి యొక్క పేరు ఈ నెల 31వ తేదీన ప్రచురితమయ్యే ఓటరు లీస్టులో పేరు కనపడదని అన్నారు. బిఎల్ఓల నుంచి తీసుకున్న ఓటరు ఫారమును తప్పనిసరిగా నింపి బిఎల్ఓలకు ఇవ్వాలని మండల తహసీల్దార్ శ్రీనివాస్ సూచించారు.

**శామీర్‌పేట డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు సందీప్‌గౌడ్‌కు సన్మానం**

**..అలియాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ కె.శిరీషకృష్ణారెడ్డి**

**శామీర్‌పేట, జులై 7, ప్రభాతవార్త:**

శామీర్‌పేట డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులుగా నియమితులైన నక్క సందీప్‌గౌడ్‌ను అలియాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ కె.శిరీషకృష్ణారెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించి అభినందనలు తెలిపారు. మంగళవారం శామీర్‌పేట డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులుగా నక్క సందీప్‌గౌడ్ నియామకం కావటంతో ఆయన నివాసంకు వెళ్లి ఆయనను సన్మానించి సత్కరించారు. కాంగ్రెస్ పార్టీని శామీర్‌పేట డివిజన్‌లో మరింత బలోపేతం చేయటానికి కృషి చేస్తారన్న ఆశాభావంను వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వారితో పాటు బొమ్మరాసిపేట్ మాజీ ఎంపిటిసి ఎస్.ఇందిర, యాడారం మాజీ సర్పంచు వై.సుజాత,పలువురు నాయకులు పాల్గొని వారు కూడ సన్మాంచారు.



శామీర్‌పేట డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులుగా నియమితులైన నక్క సందీప్‌గౌడ్‌ను సన్మానించి అభినందించిన అలియాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ కె.శిరీషకృష్ణారెడ్డి,పాల్గొన్న తదితరుల దృశ్యం

## సిఎం ఆర్ ఎఫ్ చెక్కులను అందించిన మహేశ్వరం మార్కెట్ కమిటీ డైరెక్టర్ సురేందర్

**కందుకూరు. జులై 7, (ప్రభాతవార్త):**

తెలంగాణ రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మహేశ్వరం మార్కెట్ కమిటీ డైరెక్టర్ సురేందర్ సూచించారు. ఆకుల మైలారం గ్రామానికి చెందిన పలువురు వివిధ ఆరోగ్య సమస్యలతో ఆసుపత్రిలో వైద్య సేవలు పొందిన పేదలు ప్రభుత్వ ఆర్థిక సహకారం కోసం సీఎంఆర్ ఎఫ్ పథకం మంజూరు చేయాలని దరఖాస్తు చేసుకోగా మహేశ్వరం నియోజకవర్గ అధికార పార్టీ ఇంచార్జ్ కిచెన్ గారి లక్ష్మారెడ్డి చొరవ తో లబ్ధిదారులు పోల్కం మల్లేష్ రూపాయలు 60,000 వేలు. గొరిగే యాదయ్యకు రూపాయలు 35000. రావుల మల్లేష్ కు 23,000, లాడే లక్ష్మమ్మకు 15000 చొప్పున సీఎంఆర్ఎఫ్ నిధులు మంజూరు కావడం జరిగింది. లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా సురేందర్ మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం నిరంతరం ప్రజల సంక్షేమం గురించి ఆలోచన చేస్తుందన్నారు ప్రభుత్వం అందిస్తున్న సహాయ సహకారాలను సద్వినియోగం చేసుకొని ఎదగాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న సేవలకు ప్రజలు మద్దతుగా నిలవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గొరిగెరాజు, జాంగిర్, శ్రీశైలం, పర్వతాలు, మల్లేష్ తో పాటు స్థానిక పెద్దలు గ్రామస్తులు పాల్గొన్నారు.

**ఆడబిడ్డ పెళ్లికి అండగా సర్పంచ్ బిసా కవిత కరుణాకర్ రెడ్డి**

**కేశంపేట, జులై 7, ప్రభాతవార్త:** కేశంపేట మండల పరిధిలోని తొమ్మిదిరేకుల గ్రామానికి చెందిన బ్యాగరి సావిత్రి–కేశవులు దంపతుల కుమార్తె భార్గవి వివాహం జూలై 8న జరిగేందుకు నిశ్చయమైనది. ఆడబిడ్డ పెళ్లికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తూ తొమ్మిది రేకుల గ్రామ సర్పంచ్ బీసా కవితా కరుణాకర్ రెడ్డి అండగా నిలిచారు. పేదింటి ఆడబిడ్డ పెళ్లికి చేయూత అందిస్తూ తన గొప్ప మనసును చాటుకున్నారు . వధువుకు చీరతో పాటు రూ.10,000 నగదు ఆర్థిక సహాయం అందజేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ కవితా కరుణాకర్ రెడ్డి మాట్లాడుతూ, నిరుపేద కుటుంబాల ఆడబిడ్డల వివాహాలకు తమ వంతు సహాయ సహకారాలు అందజేయడం ఎంతో ఆనందాన్ని ఇస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా పెళ్లికూతురు కుటుంబ సభ్యులు, గ్రామస్తులు మాట్లాడుతూ గొప్ప మనసుతో గ్రామంలో ఎవరికి ఏ చిన్న కష్టం వచ్చినా మేమున్నామంటూ అందరికీ తోడుగా, అండగా నిలిచిన సర్పంచ్ కవిత కరుణాకర్ రెడ్డికీ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ రంగయ్య, మాజీ ఉపసర్పంచ్ నరసింహారెడ్డి, వార్డు సభ్యులు గుత్తి చంద్రయ్య, పోగుల నర్సింలు, నరేష్, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చిట్టిరెడ్డి వెంకట్ రెడ్డి, గుత్తి శేఖర్, నిరంజన్, శ్రీనివాస్ రెడ్డి, రామ్ రెడ్డి, మురళీధర్ గౌడ్, పాండు, మల్లయ్య, మాధవయ్య, దాసరి రవి, రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

**పోతాయిపల్లిలో ఘనంగా శ్రీరేణుకాఎల్లమ్మదేవి దివ్య కళ్యాణోత్సవం**



పోతాయిపల్లిలోని శ్రీరేణుకా ఎల్లమ్మదేవి ఆలయంలో అమ్మవారి దివ్య కల్యాణోత్సం సందర్భంగ పాల్గొన్న జిల్లా ఆర్టీఏ మెంబర్ బి.జైపాల్‌రెడ్డి,పాల్గొన్న నాయకుల, నిర్వాహకుల దృశ్యం

**శామీర్‌పేట, జులై 7, ప్రభాతవార్త:** పోతాయిపల్లిలో నూతనంగా నిర్మించిన శ్రీరేణుకాఎల్లమదేవి విగ్రహాల ప్రతిష్ఠ, దివ్య కల్యాణోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. మంగళవారం శామీర్‌పేట మండ లంలోని పోతాయిపల్లిలో శ్రీరేణు కా ఎల్లమ్మ అమ్మవారి దివ్య కల్యా ణోత్సవం ఘనంగా జరిగింది. ఇటీవలనే విగ్రహాల ప్రతిష్ఠ ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం ఆలయంలో అమ్మవారి దివ్యకల్యాణోత్సవం కన్నులపండు గగా ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్టీఏ మెంబర్ బి.జైపాల్‌రెడ్డి, శామీర్‌పేట మండల కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు వై. శంకర్‌గౌడ్, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కత్తి రమేశ్, పలువురు భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. పోతాయిపల్లి గౌడసంఘం సభ్యుల ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. దీనిలో మాజీ ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, గౌడసంఘం సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## ఘనంగా మంద కృష్ణ మాదిగ జయంతి

**మోమిన్‌పేట్, జులై 7, ప్రభాతవార్త :** 30,ఏళ్ల సుధీర్ఘ పోరాటం చేసి మాదిగల వర్గీకరణ సాధించిన ఘనత మందకృష్ణ మాదికకే దక్కుతుందని కోల్కొంద మాజీ పర్పంచ్, తెలంగాన రాష్ట్ర సర్పంచుల ఐక్యవేదిక మాజీ అధ్యక్షులు కాంగ్రేస్ పార్టీ సీనియర్ నాయకుడు కిరింటి సురేశ్ అన్నారు. మంగళవారం రోజు మందకృష్ణ మాదిగ పుట్టిన రోజు సంధర్భంగా మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద కేక్ కట్ చేసి నాయకులకు తినిపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ఎస్సీ వర్గీకరణ కొరకు మందకృష్ణ మాదిగ 1994వ, సంవత్సరంలో మాదిగ రిజర్వేషన్ పోరాటసమితిని స్థాపించి, ఎన్నో ఆందోళనలు, సభలు నిర్వహించారని తెలిపారు. ఇన్నేళ్లు చేసిన పోరాటంలో ఏనాడు శాంతి భద్రతలకు భంగం కలిగించలేదన్నారు. అహింసా మార్గంలో అకుంటిత దీక్షా పటిమతో ప్రభుత్వాలతో పోరాడిన ఏకైక వ్యక్తి మందకృష్ణ అని పేర్కొన్నారు. దీని ఫలితంగా దేశ అత్యుత్తమ పురస్కారాల్లో ఒకటైన పద్మశ్రీ అవార్డు ఆయనను వరించిందని చెప్పారు. కాబట్టి అటువంటి వర్గీకరణ ఫలితాలను మాదిగలు సద్వినియోగపరచుకొని ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాక్షించారు. ఈ సందర్భంగా మాదిగల తరపున మందకృష్ణ మాదిగలు పుట్టినరోజు సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఉద్దాల జైపాల్, కోస్గి నర్సింలు, భీమయ్య, మహిపాల్, రాజు, చంద్రకాంత్, సామెల్, దాస్, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.



మంద కృష్ణ మాదిగ జయంతిని పురస్కరించుకొని వేడుకలు జరుపుకుంటున్న నాయకులు